APTEL 15625

అటవీశాఖ సమాచార పత్రిక

వన సంరక్షిణి

అక్టోబర్ 2018

సంపుటి : 1 సంచిక : 7

చీఫ్ ఎడిటర్

జె.ఎస్.ఎన్.మూర్తి, M.Sc (Ag), M.Sc (Forestry)
సంచాలకులు : ఎ.పి. స్టేట్ ఫారెస్ట్ అకాడమీ

ఎడిటోరియల్ విభాగం

ఎం. శ్రీనివాసరావు
ఉప సంచాలకులు

ఎం.వి. ప్రసాదరావు
ఉప సంచాలకులు

దీక్షితుల సుబ్రహ్మణ్యం
పి.ఆర్.ఓ.

నగరవనంలో 'పిల్లల రాజ్యం' ప్రారంభించిన పిసిసిఎఫ్ రిజ్వి

దివాన్ చెరువు ఏరియాలో ఉన్నమహాపుష్కర నగరవనంలో ఏర్పాటు చేసిన పిల్లల సాహస క్రీడా ప్రాంగణాన్ని జూలై 31న రాష్ట్ర ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి (అటవీదళాధిపతి) మహ్మద్ ఇలియాస్ రిజ్వి ప్రారంభించారు. పిల్లలకోసం వివిధ క్రీడా, సాధన పరికరాలను, ఆర్చరీ తదితర ఏర్పాట్లను ఇందులో సమకూర్చారు. ఈ సందర్భంగా అటవీ దళాధిపతి నగరవనంలోని యాంఫి థియేటర్, మెరైన్ ఎగ్జిబిషన్, నేచర్ స్టడీ సెంటర్, నర్సరీ విభాగాలను పరిశీలించారు. నగరవనంలో ఏర్పాట్లు, నిర్వహణా బాగున్నాయని ప్రశంసించారు. ఇంకా ఆకట్టుకునేలా, సందర్శకుల సంఖ్య పెరిగేలా మరిన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. (2వ పేజీలో)

అటవీ అకాడమీని సందర్శించిన అదనపు పిసిసిఎఫ్ ఝా

దివాన్ చెరువులో గల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీ ని అటవీశాఖ అదనపు ప్రధాన ముఖ్య సంరక్షణాధికారి ఎ.కె. ఝా సెప్టెంబర్ 15న పరిశీలించారు. రాజమండ్రి లోని అటవీ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ పరిధిలోని డిఎఫ్ఓలతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన అకాడమీకి వచ్చారు. రాజమండ్రి ముఖ్య అటవీ సంరక్షణాధికారి శాంతిప్రియ పాండే, కాకినాడ డిఎఫ్ఓ డాక్టర్ నందని సలారియా, వైల్డ్ లైఫ్ విభాగం డిఎఫ్ఓ అనంత శంకర్ కూడా ఆయనతో ఉన్నారు. (2వ పేజీలో)

అటవీ అకాడమీ డైరెక్టర్‌గా జెఎస్ఎన్ మూర్తి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీ (ఎపిఎస్ఎఫ్ఏ) సంచాలకునిగా రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి జెఎస్ఎన్ మూర్తి సెప్టెంబర్ 6న పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాజమండ్రి సర్కిల్ అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారిగా జూన్ 30న ఆయన పదవీ విరమణ చేసారు. లోగడ 7 మాసాల పాటు అకాడమీ డైరెక్టర్ గా ఇన్‌ఛార్జి బాధ్యతలు కూడా మూర్తి నిర్వహించారు. అకాడమీ అంశాలలో సమగ్ర అవగాహన ఉన్న మూర్తి ఇన్చార్జి డైరెక్టర్‌గా అకాడమీ మౌలిక సదుపాయాల అభివృద్ధికి విశేషకృషి చేసారు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం ఆయనను అకాడమీ పూర్తి స్థాయి డైరెక్టర్‌గా నియమించింది. బాధ్యతల స్వీకరణ సందర్భంగా మూర్తిని అకాడమీ డెప్యూటీ డైరెక్టర్లు ఎంవి ప్రసాదరావు, (2వ పేజీలో)

Remove Watermark Now

జంతు జాలం

కుందేలు

కుందేలు క్షీరద జాతి జంతువు. జీవశాస్త్రంలో లాగొమార్ఫా వర్గంలో లెపోరిడే కుటుంబానికి చెందినవి. వీటిలో అనేక రకాలున్నాయి.

శరీర నిర్మాణం : కుందేళ్ళలో ఆహారం అధికంగా పెద్దప్రేవులలో జీర్ణమౌతుంది. కనుక వీటి పెద్ద ప్రేవు వీటి కడుపుకంటె 10 రెట్లు పెద్దగా ఉంటుంది. వీటి గుదద్వారం లోనుండి వచ్చే Cecotropes లేదా night feces అనే పదార్ధంలో ఖనిజ లవణాలు, విటమిన్లు, ప్రొటీనులు ఎక్కువ మోతాదులో ఉంటాయి. కుందేళ్ళు వీటిని కొంతవరకు తింటాయి. ఇలా కుందేళ్ళు ముఖ్య పోషక పదార్ధాలను స్వయంగా ఉత్పాదన చేసుకొంటాయి. కుందేళ్ళకు రెండు జతల కుంతకాలు, ఒకదాని వెనుక ఒకటి ఉంటాయి. కనుక rodents అని పొరపడుతుంటారు.

కుందేలుకు, చెవుల పిల్లికి తేడాలు

చెవుల పిల్లిని ఆంగ్లంలో hare అంటారు. కుందేలు, చెవుల పిల్లి మధ్య చాలా పోలికలున్నాయి. కాని కుందేలుకంటే చెవులపిల్లి సైజు పెద్దది. పేరుకు తగ్గట్టు చెవులపిల్లి చెవులు బాగా పెద్దవి. కుందేలు పిల్లలు పుట్టినపుడు వాటికి వెంద్రుకలు ఉండవు, వాటికి కళ్ళు కనపడవు. కాని చెవుల పిల్లి పిల్లలు పుట్టి నపుడు వాటికి వెంద్రుకలు ఉంటాయి, చూపు ఉంటుంది. ఎక్కువ జాతుల కుందేళ్ళు (cotto - ntail rabbit మినహా) నేల అడుగున బొరియల్లో ఉంటాయి. చెవులపిల్లులు భూమిపై గూళ్ళలో ఉంటాయి. చెవులపిల్లి బొచ్చుమీద నల్లని గుర్తులుంటాయి. కుందేళ్ళను పెంచుకుంటారు. కానీ చెవుల పిల్లలను పెంచరు.

ఇవి బరువును బట్టి 3 రకాలు.

ఎక్కువ బరువున్న జాతులు : బరువు 4నుండి 6 కిలోలు. తెల్ల (వైట్) జైంట్, బూడిద రంగు (గ్రే) జైంట్, ఫ్లెమిష్ జైంట్

మధ్యరకపు బరువున్న జాతులు : బరువు 3 నుండి 4 కిలోలు. న్యూజిలాండ్ వైట్ (తెల్లని), న్యూజిలాండ్ రెడ్ (ఎర్రని), కాలిఫోర్నియన్‌జి

తక్కువ బరువు జాతులు : 2 నుండి 3 కిలోలు, సోవియట్ చిన్ చిల్లా డచ్‌జి

ఆరోగ్యకరమైన కుందేళ్ళ లక్షణాలు: ఆరోగ్యకరమైన మెరిసే బొచ్చు, చాలా చలాకీగా ఉండడం, పూర్తిగా, తొందరగా ఆహారాన్ని తినడం, కళ్ళు ఎప్పుడూ మెరుస్తూ స్రావాలు లేకుండా ఉండడం, క్రమేణా బరువు పెరుగుట

అనారోగ్య లక్షణాలు : నిస్తేజంగా నీరసించి ఉండడం, బరువు కోల్పోవడం మరియు కృశించిపోవడం, బొచ్చు ఊడిపోవడం, చలాకీగా లేక, బోనులో ఒకచోటే గడపడం. నీరు, శ్లేష్మం లాంటి స్రావాలు కంటినుండి, ముక్కు నుండి, మలద్వారం, నోటి నుండి స్రవించటం, శారీరక ఉష్ణోగ్రతలో మరియు శ్వాసలో పెరుగుదల

జీవనం, ఆవాసం: కుందేళ్ళు ఎడారుల్లోనైనా, ఉష్ణ మండల అరణ్యాల్లోనైనా, చిత్తడినేలల్లోనైనా జీవిస్తాయి. కుందేళ్ళు శాకాహారులు. గడ్డిని, కాయగింజల నూ తీసుకుంటాయి. కొన్నిదేశాల్లో మాంసం కోసమే కుందేళ్ళను పెంచుతారు. దీన్ని క్యూని కల్చర్ అంటారు.

పర్యావరణ సమస్యలు : వీటిని అడవుల్లో వదలడం వల్ల పర్యావరణ సమస్యలను సృష్టిస్తున్నాయి. విపరీతమైన ఆకలి, వేగంగా సంతాన వృద్ధి వల్ల వ్యవసాయానికి ముప్పు కలుగుతుంది.

Rabbit

కుందేలు పెంటికలు (ఎడమ) పాదముద్రలు (కుడి)

వృక్ష జాలం

కలపకు రారాజు టేకు

టేకు చెట్టు శ్రేష్టమైన కలపకు ప్రసిద్ధి. దీన్ని కలపలో రారాజుగా పరిగణిస్తారు. భారత దేశంలోని టేకు వెర్బినేసి కుటుంబానికి చెందినది. దీని శాస్త్రీయనామం 'టెక్టోనా గ్రాండిస్'. టెక్టోనా అంటే వడ్రంగి ఇష్టపడేది అని అర్థం. మనదేశ జనాభాలో 30 శాతం మంది టేకు కలపను ఉపయోగిస్తున్నారని అటవీశాఖ సర్వేలో తేలింది. కానీ మంచి కలప తయారుకావడానికి కనీసం 15-20 సంవత్సరాలు పడుతుంది. టేకుచెట్టు 80 నుంచి 150 అడుగుల వరకు పెరిగే చెట్టు.

టేకు కలప దృఢంగా ఉండి, చెదలను తట్టుకొని, ఎక్కువకాలం మన్నుతుంది. ముదురు గోధుమ రంగు చారలు కలిగి దీనితో చేసిన వస్తువులు చాలా అందంగా ఉంటాయి. అందువలన గృహోపకరణాల తయారీలో వాడడానికి ఎక్కువమంది ఇష్టపడతారు.

టేకు చెట్లు ఇండియాలో ఎక్కువే.. కానీ ఆంధ్రప్రదేశ్‌లో తక్కువనే చెప్పాలి. కొన్నేళ్ళుగా ఏజెన్సీ పరిసరాల్లో, అడవుల్లోను నాటి పెంచుతున్నారు. ఇవి అన్ని మంచి నేలల్లోను పెరుగుతాయి. అయితే ఒండ్రు మట్టి భూముల్లో విస్తారంగా పెరుగుతాయి. సమశీతోష్ణ స్థితులు దీనికి అవసరం. ఎండ, నీరు ఏదో ఒకటే విస్తార్ణంగా ఉంటే ఏపుగా పెరగవు. గింజలను నాటిన తదుపరి మొక్కలు వచ్చి రెండు మూడడుగులు పెరిగిన తరువాత ఆ చిన్న మొక్కలను దూర దూరముగా పాతుతారు. పెద్ద చెట్లను వేరు చోట్ల పాతడం వల్ల తల్లి వేరు విరిగిపోతుంది, అందుకే చిన్నవిగా ఉన్నప్పుడే తీసి పాతవలెను. కొన్ని చోట్ల గింజలను మొదటనే దూరంగా పాతుతారు. అడవులలో టేకు చెట్లు మొలిచే చోట వెదురు కూడా మొలుస్తుంది. వెదురు మొక్కలు దట్టముగా ఉంటే చిన్న టేకు మొక్కలు ఎండ, వెలుతురు కొరవడి చనిపోతాయి. ఒక్కొక్కప్పుడు పక్షులు ఏవో గింజలను ఈ చెట్లమీద రాల్చును. ఈ గింజలు మొక్కలుగా మొలిస్తే టేకు చెట్ల సారము లాగేస్తాయి. టేకు చెట్లను ఆరేడు అడుగు ల చుట్టుకొలత ఉన్నప్పుడే నరకాలి.

కలపలో టేకు కలప శ్రేష్టమైనది. ఇది నీటిలో చిరకాలము చీకిపోకుండా ఉంటుంది. దీనితో పడవలు చేసిన పుడు దీని మీద వేసిన మేకులకు కూడా ఈ చెక్క తుప్పు పట్టనీయదు. కలపను దొలిచే పురుగులు కూడా దీనిని పెద్దగా ఆశించవు. అన్ని చెక్కడపు పనులకు, బీరువాలకు, బల్లలకు, మేడ మెట్లు గట్టుటకు రైలు బండ్లకు, ఓడలకు, అన్నిటికి దీని కలప పనికివస్తుంది.

ఈ కలపను కాగులో వేసి కాల్చిన యెడల తారు వచ్చును. దీని నుండి చమురు తీసి దానిని ఔషదములలో వాడుతున్నారు. దీని ఆకుల్ని ఒకవిధమైన పట్టు పురుగు తింటుంది. టేకు వ్యాపారము మన దేశమున కంటే బర్మా దేశమున ఎక్కువ. టేకు కలప మన దేశమునుండి యొక్కువగా ఇంగ్లాండుకి ఎగుమతి అవుతున్నది. టేకు మొక్కలను పెంచుకుంటే మంచి ఆదాయం పొందవచ్చు. వీటిని ఇంటి ఆవరణ, రైతులు పొలం గట్లపై, ఎక్కడైనా పెంచుకోవచ్చు. టేకు మొక్కలు నాటడానికి అనుమతులు అవసరం లేదు. గతంలో ఉపాధి హామీ, అటవీశాఖ వన సర్సరీల ద్వారా టేకు మొక్కలు అందుబాటులో ఉండేవి. డబ్బులు చెల్లించి కొనుక్కోవాల్సి ఉండేది. పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో పాటు ప్రజలకు ఆదాయం వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం హరిత హారం కార్యక్రమాన్ని ప్రారంభించి ఉచితంగా టేకు మొక్కలు పంపిణీ చేస్తున్న ది.

కోతకు అనుమతి తప్పని సరి..

టేకు చెట్టును నరకడానికి అటవీశాఖ అధికారుల అనుమ తి తప్పనిసరి. నరికే సమయం వచ్చినప్పుడు డివిజనల్ అటవీ కార్యాలయంలో సంప్రదిస్తే అను మతి పత్రం ఇస్తారు. దాన్ని పూర్తి చేసి మొక్కలు నాటిన భూమి సర్వేనంబర్ నమోదు చేయాలి. తర్వాత వీఆర్‌వో, తహసీల్దార్ ధృవీ కరణ పత్రాల్ని డివిజనల్ అటవీ అధికారికి అందజేస్తే కోతకు అనుమతిస్తారు. ఎకరంలో సుమారు 800 టేకు మొక్కలు నాటుకోవచ్చు. అవి 20నుంచి 30ఏళ్లలో కోతకు వస్తాయి. బాగా పెరిగిన ఒక్కో చెట్టు 8 నుంచి 10 ఘనపు ఫీట్ల పొడవు వస్తుంది. మార్కెట్‌లో ఒక్కో ఘనపు ఫీటు మూడు వేల ధర పలుకు తున్నది. చెట్టు పొడవు 10 ఘనపుఫీట్లు వచ్చినా 30 వేల కలప వస్తుంది.

టేకు చెట్ల పెంపకంలో జాగ్రత్తలు..

మొక్కకు మొక్కకు రెండు మీటర్ల దూరం ఉండాలి. నీటి నిల్వ, తడి ఎక్కువగా ఉండే భూమిలో నాటుకుంటే మంచిది. రోజూ రెండు సార్లు నీరు పెట్టాలి. మొక్క పెరుగు తున్న కొద్దీ కాండానికి చుట్టూ కొమ్మలను తుంచి వేస్తే నిటారుగా పెరుగు తుంది. సేంద్రియ ఎరువు మంచిది. ఎండిన పేడ, పొడి వానపాములు వేస్తే తొందరగా పెరుగు తుంది. 20 నుంచి 30 ఏండ్ల మధ్యలో కాండం అర మీటరు చుట్టు కొలత వస్తే కోతకు వచ్చినట్లు గుర్తించాలి.

దేశంలోనే అతిపెద్ద టేకుచెట్టు కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో పరంబికులం అభయారణ్యంలో ఉంది. దీని ఎత్తు సుమారు 156 అడుగులు.

pdfelement

Remove Watermark Now

నిజమైన వన మహోత్సవం

ఎడిటర్స్ వాయిస్

మన దేశంలో చాలాకాలం క్రితం ఒక రాజుగారు ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవడం కోసం తన రాజ్యంలో రోజూ తిరిగేవారు. అలా తిరుగుతూ తన కంటపడిన వారిలో అవసరమైన వారికి సహాయం అందించేవారు. ఒక రోజున ఒక వృద్ధుడు ఎవరికీ చెందని ఒక ఖాళీస్థలంలో గుంతలు తవ్వి మామి డి మొక్కలు నాటుతూ, వాటికి నీళ్ళు పోస్తూ కనిపించాడు. అతని వయస్సు నూరు సంవత్సరాలుంటుందేమో ఒళ్ళు బాగా ముడతలు పడిపోయింది, తిండి కూడా సరిగా లేక అస్తిపంజరంలా ఉన్నాడు. పాపం నడవడానికి కూడా ఓపికలేదు. ఆ ముదుసలి నాటుతున్న మొక్కలు పెద్దవై పళ్ళు ఇవ్వడానికి కనీ సం పదిహేను సంవత్సరాలు పడతుం ది. అంతవరకు వృద్ధుడు బ్రతికి ఉండ డు. మరి తాను అనుభవించలేని దానికి ఇంత శ్రమ పడడం ఎందుకు? అనే అనుమానం రాజుగారికి వచ్చింది.

వెంటనే రాజు వానికి దగ్గరగా వెళ్ళి అదే విషయం అడిగారు. "నువ్వు అనుభవించలేని దానికోసం ఈ వయసులో నీకు ఈ వృధా శ్రమ ఎందుకు, హాయిగా తిని విశ్రాంతి తీసుకో. నీ పిల్లలు నిన్ను సరిగ్గా చూడడం లేదా? నీకు అవసరమైన డబ్బు ఇస్తాను, ఆ డబ్బుతో హాయిగా జీవించు, శ్రమపడకు" అన్నారు రాజుగారు.

ఆ వృద్ధుడు దగ్గరలోని మామిడి చెట్టు వద్దకు వెళ్లి ఒక ఆరమగ్గిన మామిడి పండును కోసి రాజుకి ఇచ్చి "ఈ చెట్టూ నేను నాటినది కాదు. నా చిన్నతనం నుంచి ఇది కాయలు, పళ్లూ ఇస్తూనే ఉన్నది. అలాగే ఇతర వృక్షాలూ ఇక్కడ చాలా ఉన్నాయి. అవి కూడా పళ్ళను, నీడనూ ఇస్తున్నాయి. నా చిన్నప్పటి నుండి వాటికిందే ఆడుకుని, తిని, అలసిపోయి నిదురపోయే వాళ్ళం. ఇవి లేకపోతే మా బాల్యం అంత ఆనందంగా గడిచేది కాదు. ఇన్ని సేవలు చేస్తున్న ఈ చెట్లను మా తాత ముత్తాతలు నాటారు. వారు అనుభవించడానికి కాదు. వారి వారసులమైన మేము అనుభవించ టానికి. వారే కనక ఆ రోజు వీటిని నాటి ఉండకపోతే ఈ తరం వాళ్ళు పళ్ళు తినగలరా? ఒక్కసారి ఆలోచించండి మహారాజా ! నేను ఇప్పుడు పడుతున్న శ్రమ నా కోసం కాదు, మన రాబోయే తరాల కోసం" అన్నాడు.

రాజుకి అర్థమైంది. ముందుతరాల వారికి మనం చేయవలసినదెంతో ఉంది. అలా మనం చేయకపోతే భావి తరాలకు తిండి, నీడ, వర్షం ఇవేవీ ఉండవు. ఇది గ్రహించిన ఆ రాజు నాటి నుంచి స్వయంగా ఫలవృక్షాలను, నీడనిచ్చే చెట్లను విరివిగా నాటుతూ తన రాజ్యంలో అందరు కూడా మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని ఆదేశమిచ్చాడు.

ఇవాళ మనం జరుపుకొంటున్న ఈ వనమహోత్సవాలు అలా ఆనాటి నుంచే మొదలయ్యాయి. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటితేనే పర్యావరణ పరి రక్షణ సాధ్యమవుతుంది. అప్పుడే మనమూ, మన భావితరాలూ సుఖపడతాయి. మన ముందుతరాలు మనకు ఈ ప్రకృతిని, పర్యావరణాన్ని అందించారు గనుకనే మన జీవితాలు సుఖంగా సాతున్నాయి. మరి మనం మన పిల్లల కు, మనుమలకు వాటిని అందించవద్దా? అలా అందజేయకపోతే భావితరాల జీవితాల్ని పాడు చేసిన వాళ్ళం అవుతాము. ఈ ప్రకృతి మనకు అనంత సంపదను ఇచ్చింది. దానికి ధర్మకర్తల్లా వ్యవహరించి తర్వాతి తరాలకు అప్పగించడం మన బాధ్యత. అవసరానికి తగినంత ప్రకృతి సంపద వినియోగం తప్పు కాదు. కానీ ఉంది కదా అని వృథాగా దుర్వినియోగం చేయడమే తప్పు. ఇదంతా మన స్వార్జితం కాదు... కాబట్టి దీనిని పాడు చేయడానికి మనకు హక్కు లేదు.

ప్లాస్టిక్ రహిత సమాజం
పర్యావరణ హిత ప్రపంచం

జె.ఎస్.ఎన్. మూర్తి

(జె.ఎస్.ఎన్. మూర్తి)
చీఫ్ ఎడిటర్- వనసంరక్షిణి

క్షేత్రస్థాయి భాగస్వామ్యంతో సమగ్ర కార్యప్రణాళిక

వర్కింగ్ ప్లాన్ రూపకల్పనలో అటవీ డివిజన్ల క్షేత్రస్థాయి సిబ్బంది భాగస్వాములు కావాలని, సమష్టి భాగస్వామ్యంతోనే సమగ్ర కార్యప్రణాళిక సాధ్యపడుతుందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ బయో డైవర్సిటీ (దుళ్లపల్లి) డైరెక్టర్, అదనపు ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి డి. జయప్రసాద్ అన్నారు. రాజమండ్రిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీ లో గురువారం వివిధ డివిజన్ల క్షేత్రస్థాయి సిబ్బందికి వర్కింగ్ ప్లాన్ రూపకల్పనలో శిక్షణ ప్రారంభమైంది. అటవీ డివిజన్ల పరిధిలో స్థానిక అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ పదేళ్లకోసారి వర్కింగ్ ప్లాన్ తయారు చేస్తారు. విశాఖపట్నం, పాడేరు, విజయవాడ, గుంటూరు, ఆత్మకూరు, చిత్తూరు ఈస్ట్, చిత్తూరు వెస్ట్ డివిజన్ల సిబ్బంది ఈ రెండు రోజుల శిక్షణలో పాల్గొంటున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని జయప్రసాద్ ప్రారంభిస్తూ, అడవుల శాస్త్రీయ నిర్వహణకు, సమగ్ర సంరక్షణకు వీలైన విధివిధానాలతో కార్యాచరణ ప్రణాళిక (వర్కింగ్ ప్లాన్) ను రూపొందించుకోవాలని ఆయన సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ సంరక్షణాధికారి డాక్టర్ రత్నాకర్ జవహరి (ఇనిస్టిట్యూట్ ఆఫ్ బయో డైవర్సిటీ) మాట్లాడుతూ అటవీ ప్రాంత ప్రమాణాలను, వనరుల విలువను అలాగే అవసరాలను నిర్ణయించడంలో, లక్ష్యాలను నిర్దేశించడంలో వర్కింగ్ ప్లాన్ పాత్ర చాలా కీలకమన్నారు. వర్కింగ్ ప్లాన్ పరిధిలోకి రాని అటవీ ప్రాంతం ఉండరాదని జాతీయ అటవీ విధానం స్పష్టం చేసిందని ఆయన చెప్పారు. అటవీ వనరుల సంరక్షణ, సుస్థిర నిర్వహణ, అభివ ృద్ధి మరియు సద్వినియోగం వంటి అంశాలకు సంబంధించి జాతీయస్థాయిలో ఏకీక ృత నియమావళిని 2004 లో ప్రతిపాదించారని పేర్కొన్నారు. 2014 జాతీయ అటవీ వర్కింగ్ ప్లాన్ లో భాగంగా వాతావరణ మార్పులు, జీవవైవిధ్య పరిరక్షణ, భౌగోళిక సాంకేతిక పరిశీలనల ప్రయోజనం, మట్టి, నీరు సంరక్షణ చర్యలు, అడవుల పరిసర గ్రామాల ఆర్థికాభివ ృద్ధి, సుస్థిర అటవీ నిర్వహణ మరియు ప్రజాభాగస్వామ్యం తదితర అంశాలను చేర్చడం జరిగిందన్నారు. డెప్యూటీ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అరుళ్ రాజన్, కాకినాడ డివిజన్ అటవీ అధికారి డాక్టర్ నందని సలారియా, అటవీ అకాడమీ డెప్యూటీ డైరెక్టర్ ఎంవి ప్రసాదరావు కూడా ప్రసంగించారు. తమ అటవీ ప్రాంతాల్లో ఉన్న సూక్ష్మమైన జీవ, వ ృక్షజాలాన్ని స్థానిక వాతావరణాన్ని వర్కింగ్ ప్లాన్ తయారీలో తప్పక పరిగణనలోకి తీసుకోవాలని వారన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ బయో డైవర్సిటీ సైంటిస్ట్‌లు జిస్సార్ రెడ్డి, పట్నాయక్, ప్రవీణ్ చౌహాన్ తదితరులు వర్కింగ్ ప్లాన్ రూపకల్పన విధానాలను వివరించారు.

అటవీ అమరవీరుల త్యాగాలు ఎనలేనివి

ప్రకృతి లేనిదే ఏ జీవికీ ప్రాణం ఉండదని జిల్లా అటవీ శాఖ అధికారి, కాకినాడ డీఎఫ్ఓ డాక్టర్ నందని సలారియా అన్నారు. ప్రతి ప్రాణికి జీవనాధారమైన అటువంటి ప్రక ృతిసంపదని రక్షించే కృషిలో భాగంగా ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరులు మానవాళికి ప్రాణదాతలని, వారి త్యాగాలు ఎనలేనివని ఆమె కొనియాడారు. జిల్లా అటవీ శాఖ కార్యాలయం (ఫారెస్ట్ కాంప్లెక్స్, కాకినాడ) లో డాక్టర్ నందని సలారియా ఆధ్వర్యంలో అటవీ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సోషల్ ఫారెస్ట్రీ విభాగం డిఎఫ్ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ భావితరాల మనుగడను, ప్రక ృతి సంపదను కాపాడడం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అటవీ అమరవీరులను ప్రతిఒక్కరు ప్రతి క్షణం సంస్మరించుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా టెరిటోరియల్, సోషియల్ ఫారెస్ట్రీ, వైల్డ్ లైఫ్ విభాగాల రేంజ్, సెక్షన్ అధికారులు ఏ కార్యక్రమంలో పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.

ప్లాంటేషన్ల సమగ్ర గణనకు సీసీఎఫ్ ఆదేశం

దివాన్ చెరువులోని ఎపి రాష్ట్ర అటవీ అకాడమీ ప్రాంగణాన్ని, రిజర్వ్ ఫారెస్ట్ ఏరియా, నగరవనం ప్రాంతాలను శుక్రవారం ముఖ్య అటవీ సంరక్షణాధికారిణి శాంతిప్రియ పాండే పరిశీలించారు. పలు ప్లాంటేషన్ల పరిస్థితిని ప్రత్యక్షంగా చూసారు. ఈ సందర్భంగా అన్ని ప్లాంటేషన్లను సత్వరం సమగ్రంగా ఎన్యుమరేషన్ చేసి ప్రస్తుత సమాచారాన్నిపూర్తిగా రికార్డు చేయాలని స్టేట్ సిల్వికల్చరిస్ట్ శ్రీహరి గోపాల్‌ను ఆదేశించారు. సిల్వి కల్చర్ విభాగం ఆధ్వర్యంలో ప్రణాళికా బద్ధమైన పరిశోధనా కార్యక్రమాలను నిర్వహించా లన్నారు. ఇందుకోసం యాక్షన్ ప్లాన్ తయారు చేసి పంపితే తగిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. నగరవనం ప్రాంగణంలోని మెరైన్ లేబొరేటరీ, వృక్ష పరిశోధనలయం, బయో డైవర్సిటీ సెంటర్, వాకింగ్ ట్రాక్స్, యాంఫి థియేటర్, బాంబు సెటమ్, ప్లాంటేషన్స్ ను చూసి వాటి నిర్వహణను మెరుగుపరిచేందుకు సూచనలు చేసారు. కార్యాలయం, ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అటవీ అకాడమీ ఉప సంచాలకులు శ్రీనివాసరావు, ఎంవి ప్రసాదరావు, ఎస్ ఎస్ శ్రీహరి గోపాల్, నగరవనం రేంజ్ అధికారి శ్రీసాయి, అకాడమీ ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

pdfelement

Remove Watermark Now

ఫారెస్ట్ అకాడమీ డెప్యూటీ డైరెక్టర్ ప్రసాదరావు అటవీ సేవాపతకం

ఎపి స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డెప్యూటీ డైరెక్టర్ ఎంవి ప్రసాదరావుకు 2017 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ వన సంరక్షణ పతకం (రజతం) లభించింది. తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆయన ఈ పతకం అందుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో విలీన మండలాలతో ఏర్పాటైన చింతూరు అటవీ డివిజన్ మొదటి డిఎఫ్ఓ గా ఆయన పనిచేసారు. పోడు సాగును అరికట్టడంలో, కలప అక్రమ రవాణా నిరోధంలో చూపిన నిబద్ధతకు, సాధించిన ఉత్తమ ఫలితాలకు గుర్తింపుగా ఈ సేవాపతకం లభించింది. సేవాపతకం స్వీకరించిన సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ తన సేవలకు ప్రభుత్వ గుర్తింపు లభించడంపై హర్షం వ్యక్తం చేసారు. ఇది తన బాధ్యతను మరింత పెంచిందని చెప్పారు. ప్రసాదరావును అటవీ అకాడమీ డైరెక్టర్ జేఎస్ఎన్ మూర్తి ఇతర అధికారులు అభినందించారు.

కోరింగ ఏరియాలో తేనెటీగల పెంపకం

కోరింగ పరిసర గ్రామాల్లోని ప్రజలకు తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో జూలై 3న కోరింగ మడ అడవుల్లో అటవీ శాఖ, ఇగ్రీ – ఐక్యరాజ్య సమితి అభివృద్ధి ప్రాజెక్ట్ (జిఇఎఫ్) సంయుక్తంగా వర్క్‌షాప్ నిర్వహిం చాయి. ఆచార్య ఎన్‌జి రంగా యూ నివర్సిటీ (విజయరాయి) ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ మోహనరావు తేనె సాగు విధానాలను, తేనెటీగల జీవన విధానాన్ని వివరించారు. ప్రజల జీవనోపాధి కల్పనలో, పుప్పొడి సేకరణ ద్వారా జీవ వైవిధ్యాన్ని పెంపొందించడంలో తేనెటీగలు నిర్వహించే ప్రముఖ పాత్రను ఆయ న వివరించారు. కోరింగ పరిసర గ్రామాల్లో పెంచడానికి అనువైన తేనెటీగల జాతులను గురించి తెలి పారు. వీటి పెంపకం ద్వారా వచ్చే ఆర్థిక ప్రయోజనాలను, అనుబంధ ఉత్పత్తుల వలన చేకూరే అదనపు ప్రయోజనాలను ఆయన వివరించారు. సదస్సుకు డివిజనల్ అటవీ అధికారి (వన్యప్రాణి విభాగం), అదనపు సీఇఓ (ఇగ్రీ) అనంత శంకర్ అధ్యక్షత వహించారు. మడ అడవులపై ఉపాధికి ఆధారపడా ల్సిన పరిస్థితులను తగ్గిస్తూ, కోరిం గ పరిసర గ్రామాలప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దే శంతో ఇక్కడ తేనెటీగలపెంపకం కార్యకలాపాలు ప్రారంభం అవుతు న్నాయని ఆయన అన్నారు. ఇగ్రీ, అటవీశాఖ సంయుక్తంగా గ్రామీణు లకు తేనెసాగులో శిక్షణ ఇవ్వడమే కాకుండా తేనెటీగలపెట్టెలను ఉచి తంగా అందజేస్తాయన్నారు. తేనె సేకరణ, ఒక బ్రాండ్ కింద అమ్మ కాలకు గాను సహకార వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందుకు యూనివర్సి టీలో ఇచ్చే ఆరు రోజులశిక్షణకు ఆసక్తి కలిగిన వారిని ఎంపికచేసి పంపాలని సర్పంచులు, జీవ వైవిధ్య అభివృద్ధి కమిటీల సభ్యులు, చైర్మన్లను ఆయన కోరారు. సుందర్ బన్ అడవులలోని (పశ్చిమ బెంగాల్) పరిసర గ్రామాల్లో తేనెటీగల పెంపకం కార్యక్ర మం గొప్ప విజయాన్ని సాధించిందని, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించిందని ఆయన తెలిపారు. ఇగ్రీ స్టేట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ రవిశంకర్ పాల్గొన్నారు.

వేటగాని ఇంటిపై దాడి..

నాటు తుపాకులు స్వాధీనం

మారేడుమిల్లి మండలం కేచల వాడ గ్రామంలో వేటగాడిగా అనుమానిస్తున్న పల్లాల దేవరెడ్డి అనే వ్యక్తి ఇంటిపై అటవీశాఖ అధికారులు జూలై 28న దాడి చేసి వన్యప్రాణుల వేటకు ఉపయోగించే రెండు నాటు తుపాకులను, నాలుగు దుప్పి పుర్రెలను, మూడు హెడ్ లాంప్స్ ను ఇతర సామాగ్రిని స్వాధీనపరుచుకున్నారు. రంపచోడవరం రేంజి అధికారి ఎ.సునీల్ కుమార్, పుల్లంగి సెక్షన్ ఆఫీసర్ హరీశ్వర్, కుట్రవాడ బీట్ ఆఫీసర్ ఇ.భూపాల్ తదితరులు ఈ దాడి చేసారు. దేవరెడ్డి ఇంట్లో దొరికిన తుపాకులతో సహా ఇతర సామాగ్రిని గ్రామ పెద్దల సమక్షంలో అటవీ అధికారులు స్వాధీన పరచుకున్నారు. అటవీ అధికారులు వెళ్లిన సమయంలో దేవరెడ్డి ఇంట్లో లేడు. నిందితుడి కోసం గాలిస్తున్నామని రేంజర్ సునీల్ కుమార్ చెప్పారు. దాడిలో పాల్గొన్న సిబ్బందిని జిల్లా అటవీ అధికారిణి డాక్టర్ శ్రీమతి నందని సలారియా ప్రశంసించారు. వన్యప్రాణుల వేటను ఎట్టిపరిస్థితు ల్లోనూ ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఈ విషయంలో గ్రామస్తులకు, గిరిజనులకు విస్తృతమైన అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.

అటవీ అకాడమీ డైరెక్టర్‌గా జెఎస్ఎన్ మూర్తి

(1వపేజీ తరువాయి)

ఎం శ్రీనివాసరావు, స్టేట్ సిల్వికల్చరిస్ట్ వి శ్రీహరి గోపాల్, విజిలెన్స్ డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, విజిలెన్స్ ఎఫ్ఆర్ఓ దివాకర్, అకాడమీ ఫాకల్టీ సభ్యులు ఎస్ వి రమణ, జోజిబాబు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి అభినందించారు. అనంతరం మూర్తి అకాడమీ అధికారులు, ఫ్యాకల్టీ సభ్యులతో సమావేశమై అకాడమీ కార్యకలాపాలపై చర్చించారు.

అకాడమీని సందర్శించిన అదనపు పిసిసిఎఫ్ ఝా

(1వపేజీ తరువాయి) ఈ సందర్భంగా అదనపు పిసిసిఎఫ్ ఝా కు అకాడమీ డైరెక్టర్ జెఎస్ఎన్ మూర్తి, డెప్యూటీ డైరెక్టర్లు ఎంవి ప్రసాదరావు, ఎం శ్రీనివాస్ స్వాగతం పలికారు. అకాడమీ ప్రాంగణంలో నిర్మించిన సమావేశ మందిరం, అసెంబ్లీ హాల్, డార్మిటరీ, బటర్ ఫ్లై పార్క్ తదితరాలను ఝా పరిశీలించారు. బటర్ ఫ్లై పార్క్ యోచన, నిర్వహణను ప్రశంసించారు. రీజినల్ ఫారెస్ట్ రీసెర్చ్ సెంటర్ పరిధిలో నర్సరీని కూడా ఆయన పరిశీ లించారు. కొండపల్లి బొమ్మల తయారీకి ఉపయోగించే తెల్లపొనికి మొక్కల నర్సరీ వివరాలను ఆయనకు సిల్వి కల్చరిస్టు శ్రీహరి గోపాల్ తెలిపారు. విధానాలను నిర్దిష్ట ప్రమాణాల మేరకు ప్రాసెస్ చేసి, నాటి సంరక్షిస్తున్నామన్నారు. అయితే మొలకెత్తే రేటు 8 శాతం మాత్రమే ఉందని తెలిపారు. ప్రయోగాత్మకంగా తెల్ల పొనికి సంరక్షణ చర్యలు చేపట్టడం ఆహ్వానించదగిన పరిణామమని ఝా అన్నారు. సక్సెస్ రేటును పెంచేందుకు మరిన్ని ప్రయోగాలు చేయాలనీ చెప్పారు. కేన్ సాగులో కూడా శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా కాలువల పక్కన, నీటి వసతి బాగున్న ప్రాంతాల్లోనూ కేన్ సాగు సఫలమ వుతుందని పేర్కొన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ రేంజర్ కుమార్, ఫ్యాకల్టీ సభ్యుడు ఎస్వీ రమణ, డిఆర్ఓ పద్మావతి తదితరులు పాల్గొన్నారు. నగరవనంలో ఉన్న మెరైన్ మ్యూజియంను బయో డైవర్సిటీ సెంటర్ ను కూడా ఝా సందర్శించారు. ఇక్కడ భద్రపరచబడిన తిమింగలం అస్థిపంజరాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. వైల్డ్ లైఫ్ డిఎఫ్ఓ అనంత్ శంకర్, రీసెర్చ్ అసిస్టెంట్ బాలాజీ వివరాలను వెల్లడించారు.

కలప స్మగ్లింగ్, గంజాయిపై పటిష్ట చర్యలు

రిజర్వ్ అటవీ ప్రాంతంలో ఎక్కడా గంజాయి సాగు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి (అటవీ దళాధిపతి) మహ్మద్ ఇలియాస్ రిజ్వీ అటవీ అధికారులను ఆదేశించారు. రాజమండ్రి సర్కిల్ పరిధిలోని డిఎఫ్ఓలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో గంజాయి మొక్కల పెంపకం, సేకరణ లేకుండా ఎక్సయిజ్, పోలీసుల సమన్వయంతో కృషి చేయాలన్నారు. అడవుల్లో కలప నరికివేత, అక్రమ రవాణా, వేటగాళ్ళ ప్రవేశంపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. చిత్తూరు ఏరియానుంచి ఎర్రచందనం రాష్ట్రవ్యాప్తంగా అక్రమ రవాణా అవుతున్నదని సమాచారం ఉన్న దృష్ట్యా నిఘాను పటిష్టం చేసుకొని అవసరమైన చోట్ల తనిఖీలు, దాడులు నిర్వహించాలన్నారు. చెక్ పోస్టులను మరింత పటిష్టం చేసి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. గ్రామాలను ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతాల సరిహద్దుల వెంబడి 100 మీటర్ల లోపలికి సుబాబుల్ మొక్కలు పెంచాలన్నారు. మొక్కలు నాటడం, సంరక్షించడం నర్సరీల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. త్వరగా పెరిగే ఈమొక్కలు అటవీ హద్దులలో రక్షణ గోడలా ఏర్పడతాయన్నారు. పశువుల మేతకు ఉపకరించే సుబాబుల్ తోట హద్దుగా ఉంటే పశువులు అడవిలోకి వెళ్ళవని, దానివల్ల అటవీ సాంద్రతను రక్షించుకోగలమని చెప్పారు. నారు, సంరక్షణ, నర్సరీ నిర్వహణ అంశాలపై ఆయన సమీక్షించారు. కొండల పైనా, రోడ్లకు ఇరువైపులా వేసే మొక్కల విషయంలో ప్రత్యేకమైన సూచనలు చేశారు. రోడ్లకు ఇరువైపులా రెండు వరుసల్లో మొక్కలు (టాల్‌ప్లాంట్స్) నాటాలన్నారు. భూసారం, తేమ పరిరక్షణ ప్రగతి పనులను ఆయన సమీక్షించారు. కందకాలు, చెక్‌డ్యాముల పురోగతిని తెలుసుకున్నారు. కందకాల గట్ల వెంబడి మూడు వరుసల్లో మొక్కలు నాటాలని సూచించారు.

pdfelement

Remove Watermark Now

ప్రమాదంలో పర్యావరణం

ప్రకృతిలో అనేక రకాలైన జీవులున్నాయి. ఉదాహరణకు బాక్టీరియా, క్రిములు, పక్షులు, చెట్లు, జంతువులు, మానవులు. ఈ భూమిపైన ఇన్ని రకాల జీవులు వుండవలసినదే. ఎందుకంటే జీవులన్నీ పరస్పరం ఒకదానిమీద ఒకటి ఆధారపడ్డాయి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ఒక జాతిజీవి నశిస్తే అనేక జీవులు నశించే ప్రమాద ముంది. రైతుల నిత్య జీవితానికి సంబంధించిన రెండు ఉదాహరణలు పరిశీలిద్దాం. మినుము, పెసర, జనుము వంటి మొక్కల వేళ్ళలో బుడిపెలు వుంటాయి. అవి నత్రజని నిల్వలు. భూమికి కావలసిన నత్రజనిని ఆ వేళ్ళు అందిస్తాయి. కాని భూమిలో ఒక రకమైన బాక్టీరియా, ఆ వేళ్ళుద్వారా మొక్క విసర్జించే పదార్థాన్ని తిని ఆ నత్రజని బుడిపెలను తయారుచేస్తాయి. అలాగే వానపాములు భూమిని నిరంతరం గుల్లగా వుంచుతాయి. దానివలన ఆ భూమి ఎంత వాననీటినైనా పట్టి వుంచగలుగుతుంది. రైతులు చీడపీడల నివారణకు ప్రకృతి సిద్ధమైన పద్ధతులు అవలంబించక, రసాయనిక మందులను అధిక మోతాదులో వాడితే, ఆ మందులు వానకు భూమిలోకి ఇంకి ఆ బాక్టీరియాను, వానపాములను చంపుతాయి. దానివలన ప్రకృతి సహజసిద్ధంగా భూమిలో వుండే నత్రజని ఎరువును ఆ భూమిలో వేసినా, భూమి స్వీకరించలేని పరిస్థితి వస్తుంది. అలాగే వానపాములు చచ్చిపోతే నేల గట్టిపడి, వాననీరు భూమిలోకి ఇంకలేక వృధాగా పోతుంది. ఈ రెండింటి వలన భూమి సేద్యానికి పనికిరాని పరిస్థితి వస్తుంది. ఇది తీవ్రమైన ఆహార కొరత సమస్య సృష్టిస్తుంది. అంటే మానవాళి మనుగడయే ప్రశ్నార్థకంగా మారుతుంది. ఉదాహరణకు అమెరికాలో 1949-68 మధ్య రసాయనిక మందుల వినియోగం, వాటివలన రసాయనిక నత్రజని

వినియోగం 40శాతం పెరిగింది. దానిని భూమిసరిగా తీసుకోలేక పోవడం వల్ల అది నైట్రేట్ రూపంలో కాలువలు, చెరువుల లోకి చేరి ఆ నీరు కలుషితమయింది. మరి రసాయనిక మందులు అతిగా వాడకుండా చీడపీడల నివారణ ఎలా? ప్రకృతిలోనే అనేక కీటకాలు చీడపురుగులను ఆహారంగా కలిగినవి వున్నాయి. వాటిని పెంచి చేలలో వదిలితే చాలు, సస్యరక్షణ అద్భుతంగా జరుగుతుంది.

కాబట్టి జీవవైవిధ్యం నాశనమయితే పర్యావరణం పెను ప్రమాదంలో పడుతుంది. అదొక్కటే కాదు. కార్బన్‌డయాక్సైడ్, మిథన్, క్లోరోఫ్లోరా కార్బన్ వంటి గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ కలిగించే వాయువుల వలన కూడా గ్లోబల్ వార్మింగ్ జరిగి పర్యావరణ ప్రమాదం పెరుగుతుంది. ఈ గ్లోబల్ వార్మింగ్‌కి ప్రధానంగా పరిశ్రమల నుండి వెలువడే కార్బన్‌డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి విషవాయువులు 23 శాతం, విచక్షణా రహితంగా చేసే అడవుల నరికివేత మరో 23శాతం కారణాలవుతున్నాయని శాస్త్రజ్ఞుల అంచనా. కాబట్టి పర్యావరణం, తద్వారా ఈ భూమి, సంరక్షింపబడాలంటే జీవ వైవిధ్యం కాపాడబడాలి. గ్రీన్‌హౌస్ వాయువుల విడుదల తగ్గించబడాలి. కాని వాస్తవంగా పారిశ్రామిక అభివృద్ధి ఫలాలన్నీ అనుభవిస్తున్న సంపన్న దేశాలు అభివృద్ధి కారణంగా జరుగుతున్న పర్యావరణ విధ్వంసాన్ని పట్టించుకోవడం లేదు.

చరిత్రలో గత 200 ఏళ్ళలో చోటుచేసుకున్న కొన్ని యుద్ధాల్లో విజయానికి చేపట్టిన వ్యూహాల్లో పర్యావరణ యుద్ధం కూడా ఉంది. అంటే అడవులను సర్వనాశనం చేయడం, విషపూరితమైన రసాయనాలను ప్రయోగించడం అనే పద్ధతులు ఆనాడు అవలంబించబడ్డాయి. విషరసాయనాలను ప్రయోగించడంలో ముఖ్య బాధ్యతల్లో వున్న ఒక అమెరికన్ అధికారి 1984లో ఇలా రాశారు. ఈ రసాయన యుద్ధంలో కోట్లాది మొక్కలు, వృక్షాలు చనిపోవడమే కాక నేటికీ పచ్చగడ్డి మొలకెత్తని ప్రాంతాలున్నాయి. నేలలోని పోషక జీవులు అంతరించడంతో ఆ నేల నిస్సారమైంది. వన్య మృగాలు అదృశ్యమయ్యాయి. జలచరాల ఉనికి మాయమైంది. కాలక్రమంలో వింత రూపాలతో శిశువుల జననం లాంటి దీర్ఘకాల ప్రభావాలకు ఈ యుద్ధం కారణమైంది."

నికరాగ్వాలో కూడా అమెరికన్ సైన్యం పంట చేలపైన దాడికి దిగింది. 75 మందికి పైగా పర్యావరణ శాస్త్రజ్ఞులను కిడ్నాప్ చేయడం గాని, చంపడం చేసింది. జీవ వైవిధ్యాన్ని నాశనం చేసే బిటి విత్తనాలకు ఎర్రతివాచీ పరచడం వంటి పనులు కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా చేస్తున్నాయి. బిటి విత్తనాలు, వాటితో వ్యవసాయం చేసే చేలలోనే కాకుండా, వాటి పుప్పొడి పాకినంత మేర, విత్తనాల పున రుత్పత్తి లేకుండా చేస్తుంది. దానితో కొంత కాలానికి దేశమంతా విదేశీ కంపెనీల విత్తనాలపై ఆధారపడాల్సిన పరిస్థితి వస్తుంది.

ప్రభుత్వాలకు పర్యావరణ పరిరక్షణపై చాలా చిన్నచూపు ఉంది, "ఔషధ పరిశ్రమలు ఉత్పత్తి చేసి విక్రయించే రసాయనాల మొత్తం టర్నోవర్‌పై 1శాతం పన్ను విధించి దాన్ని పర్యావరణ సంస్థల వద్ద డిపాజిట్ చేయాలని సుప్రీంకోర్టు చాలా సంవత్సరాల క్రితమే ఆదేశించినా భారతదేశంలో అది అమలు కావడంలేదు. ఈరోజుల్లో దేశభక్తులు పర్యావరణ పరిరక్షకులే. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను, పర్యావరణ విధ్వంసానికి దారితీస్తున్న పరిస్థితులను వారు ప్రజలకు వివరించి, మన భూమిని కాపాడుకొనే చర్యలను ముమ్మరం చేయాలి. భావితరాలకు పచ్చనైన భూమిని అందజేయాలి.

pdfelement

హరితాంధ్రను సాకారం చేద్దాం : చినరాజప్ప

భవిష్యత్తు తరాలను ఆరోగ్యంగా ఉంచేందుకు, హరితాంధ్రప్రదేశ్‌ను సాకారం చేయాలని, వన సంపదను పెంచాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. రాజాన గరం మండలం దివాన్‌చెరువు లోని డీబీవీ రాజు టౌన్‌షిప్‌లో జూలై 14న జిల్లా స్థాయి వనమహో త్సవం నిర్వహించారు. జిల్లా అటవీ శాఖాధికారి, కాకినాడ డీఎఫ్‌వో డాక్టర్ శ్రీమతి నందని సలారి యా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శ్రీ చినరాజప్ప మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్య తను సైతం ప్రజలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో 23 శాతం భూవిస్తీర్ణంలో అడవులు ఉండగా తూర్పుగో దావరి

జిల్లాలో మాత్రం 44 శాతం ఉన్నాయన్నారు. శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ శ్రీరెడ్డి సుబ్రహ్మణ్యం, రాజానగరం ఎమ్మెల్యే శ్రీ పెందుర్తి వెంకటేష్, శాసన మండలి సభ్యుడు శ్రీచిక్కాల రామచంద్రరావు, కలెక్టర్ శ్రీ కార్తికేయ మిశ్రా, జడ్పీ ఛైర్మన్ శ్రీ జ్యోతుల నవీన్‌కుమార్, రాజమహేంద్రవరం శాసనసభ్యుడు శ్రీ ఆకుల సత్యనారా యణ, గ్రామీణ శాసన సభ్యుడు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గుడా ఛైర్మన్ గన్ని కృష్ణ, శాసనమండలి మాజీ సభ్యుడు శ్రీ చైతన్యరాజు, జడ్పీటీసీ సభ్యుడు శ్రీ కొల్లం రత్నం, మున్సిపల్ కమిషనర్ శ్రీసుమిత్ కుమార్, సబ్ కలెక్టర్ శ్రీ సాయికాంత్‌వర్మ, డీఎఫ్‌వో శ్రీ టి.శ్రీనివాస్, డీఈవో శ్రీ ఎస్.అబ్రహం, ఎస్ఎస్ఏ పీవో శ్రీ ఎం.శేషగిరి పాల్గొన్నారు. విద్యార్థులతో మొక్కలు నాటించారు.

Remove Watermark Now

విశిష్ట ఔషధ గుణాల ఆహారం తేనె

మానవుడు కొన్ని వేల సంత్సరాల అనుభవంతో తేనెను విశిష్టమైన ఔషధగుణాలున్న ఆహారంగా గుర్తించాడు. తేనెటీగలు అచంచల శ్రమతో, మేధస్సుతో, ప్రకృతి ప్రణాళికను అనుసరించి తేనెని తయారుచేస్తున్నాయి. వాటిపై చూపుపడ్డ మానవునికి అమృతంలా తేనే లభించింది.

తేనెటీగల జీవనశైలి : తేనెటీగలు సమష్టి కుటుంబ జీవనాన్ని సాగిస్తాయి. ఎక్కడ ఏప్రాంతంలో నివాసం ఏర్పరచుకున్నా అనేక తేనెటీగలు కలసి నివసిస్తాయి . తేనెటీగలు మూడు రకాలు.

అవి 1. రాణి తేనెటీగలు
2. పోతు తేనెటీగలు
3.శ్రామిక తేనెటీగలు.

తేనెటీగల కుటుంబములో ఒక రాణి తేనెటీగ, కొన్ని వేల శ్రామిక తేనెటీగలు, పోతు తేనెటీగలు ఉంటాయి. రాణి ఈగలకన్నా శ్రామికతేనెటీగలు రెండురెట్లు పొడవుగా మూడురెట్లు బరువుగా ఉంటాయి. రాణిఈగ ప్రతి రోజు తేనె తుట్టెలలో 1000 నుండి 2000 వరకు గుడ్లు పెడు తుంది. వాటిలో ఫలదీకృతమైన గుడ్ల నుండి శ్రామిక తేనెటీగలు ఫలదీకృతంకాని గుడ్ల నుండి పోతు తేనెటీగలు పుట్టుకొస్తాయి. తేనెపట్టులో ఉండే మగ ఈగలను పోతు తేనెటీగలు అంటారు. ఇవి ఏ పనీ చేయవు. ఇవి యువరాణి ఈగలు గుడ్లు పెట్టడానికి మాత్రమే ఉపయో గపడతాయి. వీటికి పోరాడటానికి ఒక్క ముల్లు కూడా ఉండదు. ఇవి ఏరకమైన ఆహారాన్ని సంపాదించవు. శ్రామిక ఈగలు పెట్టే ఆహారాన్ని తిని బతుకుతాయి.

అలసటలేని జీవులు శ్రామికతేనెటీగలు. వాటి జీవితకా లమంతా శ్రమిస్తూనేవుంటాయి. పుట్టిన మూడవరోజు నుండే మైనపు తుట్టెలోని గదులను శుభ్రం చేసే బాధ్యత వీటిపై పడుతుంది. ఏడవరోజు నుండి రాయల్ జెల్లీ విడుదల చేసే గ్రంధులు పనిచేయటం ప్రారంభిస్తాయి. 12, 13 రోజులలో ఈ తేనెటీగలకు మైనపుగ్రంధులు ఏర్పడతాయి. అవి అప్పటికప్పుడే తేనెపట్టు నిర్మాణంలో పాల్గొంటాయి. పుట్టిన 18 రోజులలోపే పువ్వులలోని మకరందాన్ని స్వీకరిస్తాయి. మకరందాన్ని తెమ్మని రాణితేనెటీగ ప్రోత్సహించి పంపుతుంది. అవి తెచ్చిన మకరందాన్ని పరీక్షించి గదులలో భద్రపరుస్తుంది. పట్టులోని అరలు శుభ్రంగా, అందంగా ఉండేలా పర్యవేక్షిస్తుంది. రాణి తేనెటీగలకు ఒక కొండి ఉంటుం ది. అవి గుడ్లు పెట్టడానికి, రక్షణ కొరకు పనిచేసే అవయవం. రాణి తేనెటీగ మనిషిని ఎట్టి పరిస్థితుల లోను కుట్టదు. కానీ మరొక రాణి తేనెటీగ ఎదురైతే మాత్రం కొండితో కుడుతుం ది. దీని జీవితకాలం 5, 6 సంత్సరములు మాత్ర మే. శ్రామిక తేనెటీగలు, రాణి తేనెటీగలకు సేవ చేస్తుంటాయి. రాణి ఈగల దేహాన్ని శుభ్రంగా ఉండేలా చూస్తాయి. విసర్జన పదార్ధాలను బయటకు పంపుతాయి. రాణి ఈగకు పుష్టికరమైన ఆహారాన్ని తినిపిస్తాయి.

శ్రామిక తేనెటీగలకు ప్రత్యేకమైన మైనపు గ్రంధులు ఉంటాయి. ఇవి పొట్టమీద చివరలో అర్ధచంద్రాకారంగా అమరివుంటాయి. శ్రామిక ఈగలు పుప్పొడిని ప్రోగుచేసి తమ లాలాజలంతో నింపి మకరందంతో కలిపి, తమకు ఉన్నటువంటి వెనుక కాళ్లతో ప్రత్యేకమైన అరలలో ఉంచుకొంటాయి. ఒక శ్రామిక తేనెటీగ 13 మి.గ్రా మైనాన్ని , పోతు తేనెటీగలు 30 మి.గ్రా మైనాన్ని ఖర్చు చేస్తాయి. ఇవి షడ్భుజాకారంలో అరల్ని నిర్మిస్తాయి. ఈ విధంగా 100 గ్రా. బరువు తూగే తేనెతుట్టెలో 9100 షడ్భుజాకారపు అరలు ఉంటాయి. ఈ గదులలో 4 కిలోగ్రాముల తేనె నిల్వ ఉంటుందని శాస్త్రవేత్తలు పరిశోధించి తెలిపారు.

తేనెటీగ ప్రతిభాపాటవాలు అపూర్వం. పట్టులోని గదులను శుభ్రంగా, తాజాగా చక్కని గాలి వచ్చే విధంగా అమర్చు కుంటాయి. తేనెతుట్టెలో మంచి వాతావరణానికి ఎంతో పాటుపడుతుంది. బయట వాతావరణం వేడిగా వున్నప్పు డు వేసవి సమయంలో ముఖద్వారం వద్ద బారులుగా నిలబడి రెక్కలతో గాలులని గదులలోనికి విసురుతాయి. వేడిని తగ్గించి చల్లనిగాలిని పంపిస్తాయి. అలాగే చల్లని వాతావరణం ఉన్నప్పుడు తేనెపట్టులోని ఉష్ణోగ్రతను కాపాడటానికి తేనెటీగలన్ని గదులకు అడ్డంగా తెరలుగా దగ్గరగా గుమిగూడతాయి. చల్లదనం లోనికి పోకుండా కాపాడతాయి. తేనెతుట్టెను నాశనం చేయాలనే ఏ ప్రయత్నాన్నయినా మూకుమ్మడి దాడితో ఎదుర్కొంటాయి. తేనెటీగల నోటికి రుచిని చూసే శక్తి అధికం. ఇవి ఋతువులకి సంబంధించిన విజ్ఞానాన్ని కలిగి ఉంటాయి. ఆయా ఋతువులలో పువ్వుల మకరందాన్ని పుప్పొడిని స్వీకరించడానికి వెళతాయి. ఏదైనాన ఒక తేనెటీగ విరగబూచిన పువ్వులను చూసినప్పుడు వెంటనే గూటికి పరిగెడుతుంది. ఆ తేనెటీగ తేనెతుట్టె ముందు గుండ్రంగా గిరికీలు కొడుతుంది. అది చూసిన మిగిలిన తేనెటీగలు ఆయా చెట్లు ఎంత దూరంలో ఉన్నాయో తెలుసుకొంటాయి. తేనెటీగలు వలయాకారంలో నృత్యం చేస్తూ అధికంగా మకరందం ఉందని వంకరటింకరగా చేసే నృత్యాన్ని బట్టి పుప్పొడి ఉందని తెలుసుకొంటాయి. తేనెటీగల నృత్యాన్ని "వేగల్సు డాన్స్ " అని శాస్త్రవేత్తలు పిలుస్తుంటారు. తేనెటీగలు రోజూ అదే సమయానికి తేనె సేకరిస్తాయి. ఒక హెక్టారు భూమిలో ఉన్న పువ్వులనుండి 17000 కి.గ్రా.తేనెను తయారు చేస్తాయి. పువ్వులలో పరాగసంపర్కం ఎక్కువగా జరగడానికి తేనెటీగలు వాలడం పరోక్షంగా దోహదపడుతుంది.

ఇవి అద్భుతమైన ప్రక్రియ ద్వారా తేనెను తయారు చేస్తా యి. శ్రామిక తేనెటీగలు పుప్పొడిని చిన్నచిన్న గోళీకా యల్లాగా గుండ్రంగా చేసి వాటి కాళ్ళ దగ్గర ప్రోగుచే స్తాయి. మకరందాన్ని పీల్చి కడుపులో నింపుకొంటాయి. తిరిగి పీల్చిన మకరందాన్ని గొంతువద్ద ఉండే సంచిలో దాచిపెడతాయి. అవి తమపని పూర్తిచేసుకున్న తర్వాత కాళ్లదగ్గర సంచిలో ఉండే పుప్పొడిని గొంతువద్ద ఉండే మకరందాన్ని కలిపి తీసుకువెళ్లి మైనపుగదుల్లో ఉంచుతా యి. ఆ తర్వాత అదే తేనెగా తయారవుతుంది. ఏ చెట్ల మకరందాన్ని సేకరిస్తాయో ఆ చెట్ల గుణాలను ఆ తేనె కలిగి ఉంటుంది. అందుకే తేనె అనేక చెట్ల ఔషధ గుణా లను కలిగి ఉంటుంది. ప్రాచీన వైద్యుల పరిశీలనాదృష్టితో తేనెను నిత్యజీవిత ఔషధంగా గుర్తించారు.

సేకరణ : ఎ.పద్మజ
సూపరింటెండెంట్, కృష్ణా డివిజన్, విజయవాడ

pdfelement

తేనెలో ఔషధగుణాలు

1 తేనెలో గ్లూకోజ్ ఉంది. గ్లూకోజ్ శరీరం పెరుగుదలకు అద్భుతమైన పదార్థం. తేనెని వేడిపాలతో కలిపి తీసుకొంటే జలుబు తగ్గుతుంది. 50 గ్రా.నుండి 140 గ్రా చొప్పున తేనెను రెండు నెలలు పాటు తీసుకొంటే గుండెజబ్బులు నయమవుతాయి. తేనె వల్ల హిమోగ్లోబిన్ పెరిగి గుండె బలహీనత తగ్గిపోతుంది. ప్రేగులకు సంబంధించిన జబ్బులు నయమవుతాయి. అల్సరుతో బాధపడేవారు భోజనానికి ఒకటి లేక రెండు గంటల ముందు గోరువెచ్చటి నీటితో కలిపి తేనెను తీసుకుంటే కడుపులో మంటని తగ్గిస్తుంది. కాలేయం చక్కగా పనిచేయడానికి తేనె గొప్ప ఔషధం. ముల్లంగి రసంలో రోజుకి 100 నుండి 200 గ్రా. తేనెని కలిపి తీసుకొంటే మూత్రపిండాలలో రాళ్లు నయమవుతాయి.

1 నరాల బలహీనత వున్నవారు నిద్రపోయేముందు నీళ్లలో ఒక స్పూను తేనె, అరనిమ్మకాయ రసం కలుపుకొని త్రాగితే నరాలకు మంచి బలాన్నిస్తుంది. చర్మ సౌదర్యం, ముఖ సౌందర్యం పెంచుతుంది. మంచంలో ఉన్న రోగులు ఆహారం తీసుకోలేనివారికి తరచూ తేనెను ఇవ్వటంవల్ల శక్తి చేకూరుతుంది. తేనెకు చెడు బాక్టీరియాని హతమార్చే గుణముంది.

1 మంచి నీటిలోకాని, కుంకుమ పువ్వుతో కానీ తేనెని రెండు చెంచాలు ఉదయం తీసుకొంటే గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారు. శిశువుకు తేజస్సు వస్తుంది.

1 తేనె, నిమ్మరసం గోరువెచ్చని నీటితో త్రాగితే ఆరోగ్యమే కాకుండా బరువు కూడా తగ్గుతారు.

1 తేనెను సున్నంతో కలిపి పట్టి వేస్తే వాపులు తగ్గుతాయి.

1 తులసి రసంతో తేనె, పసుపు కలిపి ఇస్తే ప్లేగును నిరోధిస్తుంది.

1 పిల్లల ఎదుగుదలకి, శరీరధారుద్యానికి, మాటలు రావడానికి తేనె ఉపకరిస్తుంది. తేనె మైనాన్ని, లోషన్సులో, ఆయింట్‌మెంట్లో వాడతారు. వందల వేల ఔషధకారకాలని ఆయుర్వేద శాస్త్రంలో వైద్యులు కనిపెట్టారు. తేనె లేకుండా ఆయుర్వేద మందులు కొన్ని తయారవ్వవు. ఇన్ని ఔషధ గుణాలుండి మానవుని ఆరోగ్యానికి దోహదపడే తేనె స్వచ్ఛమైనది దొరుకుతుందా అంటే లేదనే చెప్పాలి. ఏది అసలుదో , ఏది నకిలీదో తెలియని సందిగ్ధావస్థలో జనం ఉన్నారు. ఈ మధ్య గిరిజన కార్పొరేషన్ తేనెను కూడా ప్రజలు నమ్మటంలేదు. ?

కొందరు దొంగ వ్యాపారులు తేనెతుట్టెను తెచ్చి బెల్లంపాకంతో తయారుచేసిన పదార్థాన్ని స్వచ్ఛమైన తేనె అంటూ విక్రయిస్తున్నారు. ఇది తాగితే ఆరోగ్యం అటుంచి జబ్బులు రావడం ఖాయం. అటవీశాఖలో అటవీ ఉత్పత్తుల నిర్వహణలో భాగంగా తేనెటీగల పెంపకాన్ని చేపట్టి ప్రకృతి వరప్రసాదమైన తేనెను ప్రజలకు అందించాలి. దీనివల్ల ఆదాయంతోపాటు ప్రజలకు ఆరోగ్యం చేకూరుతుంది. ప్రతి సెంట్రల్ నర్సరీలో తేనెటీగల పెంపకాన్ని చేపడితే లాభదాయకం.

Remove Watermark Now

స్మార్ట్ ఫోన్లతో బౌండరీలు, రోడ్లు, లొకేషన్ల సర్వే

పూర్వకాలంలో సర్వే చేయడానికి చెయిన్లతో ట్రయాంగులేషన్ పద్ధతి వాడుకలో ఉండేది. ఇది చిన్న ప్రాంతాలు, బహిరంగ స్థలాలకు సరైనది. ల్యాండ్ సర్వే విభాగం వారు వ్యవసాయ క్షేత్రాల సర్వేకి ఇప్పటికీ ఈ పద్ధతిని పాటిస్తున్నారు. కానీ పెద్ద ఏరియాలకు, కొండలకు, గుట్టలకు, వృక్ష సముదాయాలకు ఇది అనువు కాకపోవడంవలన కాంపాస్, చెయినుల సహాయంతో సర్వే చేసేవారు. దీనిలో కొలతలను చైను ద్వారా, దిశలను కంపాస్ ద్వారా తీసుకొని పటాలను తయారు చేసేవారు. కానీ కంపాస్‌లోని సూచిక నిజమైన దిశలను చూపక భూ ఆయస్కాంత శక్తికి లోబడి దిశలను మార్చుకొనును. ఈ ఆయస్కాంత ప్రభావం స్థిరమైనది కాదు. ఇది నిలకడలేని ప్రభావం. వివిధ ప్రాంతాల్లో ఇది వివిధ రకాలుగా ఉంటుంది. తూర్పుదేశాల్లో పాజిటివ్‌గా, పశ్చిమదేశాల్లో నెగెటివ్‌గా ఉంటుంది. ప్రతి ప్రాంతంలోనూ ఇది కాలాన్ని బట్టి మారుతూ ఉంటుంది. కంపాస్‌లో ఏ సర్వే చేసినప్పటికీ ఈ తప్పును సరిదిద్దిన తర్వాత మాత్రమే దానిని పటముగా తయారుచేయాలి. సర్వే ఆఫ్ ఇండియా పటములు అన్నీ ఈ తప్పులను సరిదిద్దిన తర్వాతే చేస్తారు. కనుక ఇప్పుడు పటమునందు ఉన్న లైన్లు, బౌండరీలను తిరిగి భూమిపై కనుగొనాలంటే ఇప్పటి ఆయస్కాంత ప్రభావం ఆ స్థలములలో ఎంత ఉన్నదో లెక్కగట్టి కంపాసు రీడింగు మార్చుకొని చేయాలి. ఆచరణ పరంగా ఇది చాలా ఇబ్బంది కలిగించే అంశం.

కాబట్టి ఈకాలంలో కాంపాస్ సర్వే బదులుగా జిపిఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) వాడుకలోకి వచ్చింది. దీనిలో కచ్చితత్వమును బట్టి పరికరాలు దొరుకుతాయి. కచ్చితత్వం అంటే లైన్లు, బౌండరీలు, ఏరియాల కొలతలు మరియు భూమిపై వాటి స్థానం. 3 మీటర్లనుంచి సెంటీమీటర్ వరకూ ఇందులో కచ్చితత్వాన్ని సాధించవచ్చు. ఇవి పదివేల రూపాయలనుంచి 3లక్షల రూపాయలు ఉంటాయి. అటవీశాఖలో ఎక్కువగా గార్మిన్ (GARMIN) కంపెనీ వారి జిపిఎస్‌లు వాడుకలో ఉన్నాయి. వీటి కచ్చితత్వము (ACCURACY) మీటర్ల నుంచి 15 మీటర్ల వరకూ ఉంటుంది. అందువలన వీటితో హద్దులను సర్వే చేయునపుడు ఎక్కువ ఏరియా ఉన్నచో ERROR తగ్గును. 500 హెక్టార్ల పైన ఏరియాకు ఈ పరికరము అనుకూలము. కానీ 100 హెక్టార్ల నుంచి 500 హెక్టార్ల వరకూ సర్వే చేయునపుడు ఈ పరికరమునందు కచ్చితత్వము 3 మీటర్ల వరకూ వచ్చే వరకూ ప్రతి స్టేషన్ వద్ద ఆగి రీడింగ్ తీసుకున్నచో ERROR తగ్గును.

చిన్న ఏరియాలకు ఇది అస్సలు అనుకూలం కాదు.

తదుపరి దీనినుంచి పటములు తయారుచేయుటకు అటవీశాఖలో సరైన అవగాహన లేక తప్పులు చేయుచున్నారు. జిపిఎస్ (GPS) పరికరమునందు సెట్టింగ్స్‌లో రెండు ముఖ్యమైనవి ఉన్నాయి. ఒకటి DATUM (డాటమ్) రెండు UNITS (యూనిట్స్). పరికరము నుండి నేరుగా కంప్యూటర్ లోకి సర్వే డేటాను డౌన్‌లోడ్ చేయునప్పుడు ఈ సెట్టింగ్‌ల గురించి పట్టించుకోనవసరం లేదు. కానీ ఎక్కువమంది ఉద్యోగులు రీడింగ్‌లను కాగితాలపై రాసుకొని కంప్యూటర్ ఆపరేటర్ల వద్ద పటములు తయారుచేయిస్తూ ఉంటారు. ఇలాంటపుడు మాత్రం సెట్టింగ్స్ చాలా ముఖ్యం. డాటమ్ ఎప్పుడూ WG & 84లో ఉండవలెను. (అక్షాంశ రేఖాంశముల యూనిట్లు ఎప్పుడూ డెసిమల్ డిగ్రీగా (డిడి) ఉండాలి. లేనిచో చాలా CONFUSION (సందిగ్ధత) ఏర్పడి సరైన పటం తయారుకాదు. అందువలన జిపిఎస్‌నుంచి డేటాను నేరుగా కంప్యూటర్ లోకి డౌన్‌లోడ్ చేయడమే మంచిది. గార్మిన్ జిపిఎస్ 72 హెచ్‌లో డౌన్‌లోడింగ్ కేబుల్ పాతరకం మొబైల్ చార్జర్ కేబుల్‌ను పోలి ఉంటుంది. లేదా పెద్ద కంప్యూటర్ షాపుల్లో ఇవి రూ.100లోపు ధరలో లభిస్తాయి. గార్మిన్ ఇ ట్రెక్స్‌లో కూడా ఈ సౌలభ్యం కలదు. ఈ జిపిఎస్‌ను వాడాలంటే బాగా ప్రావీణ్యం అవసరం. ఇవి అంత యూజర్ ఫ్రెండ్లీ కావు. దీనికి ప్రత్యామ్నాయంగా ఇప్పుడు స్మార్ట్ ఫోన్లను వాడుకోవచ్చు.

స్మార్ట్ ఫోన్ అనగా టచ్ స్క్రీన్, వైఫై, బ్లూ టూత్, జిపిఎస్ కేపబిలిటీస్ ఉన్న ఫోన్ అన్నమాట. దీనిలో జిపిఎస్ - ఎస్ఐఆర్ఎఫ్ టెక్నాలజీతో పనిచేయును. ఇది పనిచేయుటకు కూడా జిపిఎస్ శాటిలైట్‌తో లైవ్ ఆఫ్ సైట్ కావలెను. కానీ ఈ ఫోన్లు ఎక్కువగా ఇన్‌డోర్‌లో (బస్సులు, రైళ్లు, కార్లలో) వాడుటచే జిపిఎస్ శాటిలైట్ ...కి ఇబ్బంది కలుగును. కానీ దీనిలో ASSISTED GPS టెక్నాలజీ ఉండడం వల్ల ఈ ఇబ్బందిని తప్పించుకొని సమర్థవంతంగా పనిచేయుచున్నవి. ఎజిపిఎస్ టెక్నాలజీ అనగా జిఎస్ఎం సెల్ టవర్స్ లొకేషన్, సిగ్నల్ స్ట్రెంగ్త్ ద్వారా కచ్చితత్వాన్ని సాధించును. ఈమధ్య కాలంలో అమెరికాలో కొన్ని యూనివర్సిటీలలో వీటి సామర్థ్యం ఓపెన్ ప్లేస్‌లలో పరీక్షించి ఇవి HAND HELD జిపిఎస్‌ల కంటే ఖచ్చితత్వం కనబరుస్తున్నట్లు గ్రహించారు. ఈ ఫోన్ల వలన ఇతర లాభాలు ఏమిటంటే ఇవి అమెరికా జిపిఎస్ శాటిలైట్స్‌నే కాక మిగిలిన అందుబాటులో ఉన్న దేశాల శాటిలైట్ సిగ్నల్స్ కూడా తీసుకొని కచ్చితత్వాన్ని పెంచుతున్నాయి. వీటికోసం అనేక ఫ్రీ, ఖరీదైన యాప్‌లు కూడా విరివిగా లభిస్తున్నాయి. ఇవి నేర్చుకోవడం, వీటిని వాడడం కూడా సులభం (GRAPHIC USER INTERFACE) తదుపరి మనం సర్వే చేస్తున్న లైన్ గాని ఏరియా గాని రియల్‌టైమ్‌లో గూగుల్ ఎర్త్, గూగుల్ మ్యాప్ లేదా ఇతర జిపిఎస్ యాప్స్‌లో కూడా చూడవచ్చు. చేసిన సర్వేను సేవ్ చేసి (.klm or .kmy) Whats app ద్వారా క్షణాల్లో కావలసిన చోటుకి పంపి పటములు తయారు చేసుకోవచ్చు.

ఈ ఫోన్లలో జిపిఎస్ మాదిరి 3 మీటర్ల ఎర్రర్ (లోపం) ఉండవచ్చు. కానీ ఈ ఎర్రర్‌ను సవరించేందుకు పెద్ద ఎత్తున పరిశోధనలు జరుగుతున్నాయి. అమెరికాలో WAAS (వైడ్ ఏరియా ఆగ్మెంటేషన్ సిస్టం) మాదిరి ఇండియాలో గగన్ శాటిలైట్‌కి చిన్న డాంగిల్ సహాయంతో కనెక్ట్ చేసి ఖచ్చితమైన పటములు తయారుచేసుకోవచ్చు. కొన్ని కంపెనీలు మనకి వచ్చే జిపిఎస్ సిగ్నల్స్‌ను కరెక్ట్ చేసి ఇచ్చే సాఫ్ట్‌వేర్‌ని అందిస్తున్నాయి. కానీ ఇది ఖరీదుతో కూడుకున్న సబ్‌స్క్రిప్షన్. పైన చర్చించిన విషయాలను బట్టి మనం అర్థం చేసుకోవలసింది ఏమిటంటే మొబైల్ ఫోన్ మన ఇతర పనులనే కాకుండా సర్వే అవసరాలను కూడా త్వరలో మంచి కచ్చితత్వంతో చేసిపెట్టే వెసులుబాటు వస్తుందన్నమాట.

గూగుల్ ఎర్త్‌లో పటములను సులువుగా, అందంగా ఎలా తయారుచేసుకోవచ్చునో తరువాతి సంచికలో తెలుసుకుందాం.

- పి. ఉదయశంకర్
డివిజనల్ అటవీ అధికారి (రిటైర్డ్)

pdfelement

నగరవనంలో పిల్లలరాజ్యం.. ప్రారంభించిన పిసిసిఎఫ్ రిజ్వి

(1వపేజీ తరువాయి) ఉపయుక్తమైన కొత్త ఆలోచనలతో ప్రాజెక్టుల్ని ప్రతిపాదిస్తే వెంటనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఔషధ మొక్కల ఏరియాలో బెడ్స్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీలో పెంచుతున్న టాల్ ప్లాంట్స్ ను ఇతర మొక్కల్ని పరిశీలించారు.

బెంగళూరు టెక్నిక్ లో మొక్కలనుపెంచుతున్న ఏరియాను పీసీసీఎఫ్ కి చూపించి వాటి ప్రత్యేకతలను టెరిటోరియల్ డి ఎఫ్ ఓ (కాకినాడ) డాక్టర్ నందని సలారియా వివరించారు. ఈ సందర్భంగా అటవీ దళాధిపతి రిజ్వి మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 25 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఆమేరకు ప్రతి నర్సరీలో తగిన సన్నాహాలు చేసుకొని వనవ్యాప్తికి పాటుపడాలని సూచించారు. రాష్ట్రంలో 25 తీర్థ యాత్ర స్థలాల్లో ఎకోటూరిజం, వనమిత్ర వంటి ప్రాజెక్టులు ప్రతిపా దించి, వాటి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కోరంగి మడ అడవుల అభయారణ్యంలో ఎకో టూరిజం అభివృద్ధి చర్యలను ఈ సందర్భంగా వైల్డ్ లైఫ్ డీఎఫ్ఓ అనంత్ శంకర్ పీసీసీఎఫ్ రిజ్వికి వివరించారు. ఎకో టూరిజం ప్రాతాల్లో సోలార్ బోట్స్ ను ప్రవేశ పెడితే బాగుంటుందని అనంత్ శంకర్ చెప్పగా ప్రతిపాదనలు పంపమని సూచించారు. రాజమండ్రి సర్కిల్ సీసీఎఫ్ రాహుల్ పాండే (ఎఫ్ఏసీ), వివిధ విభాగాల డీఎఫ్ఓలు నాగేశ్వరరావు, శివశంకర రెడ్డి, ఎంవి ప్రసాదరావు, నగరవనం ఇన్ ఛార్జి శ్రీసాయి, రీసెర్చ్ అసిస్టెంట్ బాలాజీ తదితరులు పాలొన్నారు.

Remove Watermark Now

జీవవైవిధ్యానికి ఆటపట్టు... పర్యావరణానికి ఆయువుపట్టు

పాపికొండ జాతీయవనం

పాపికొండ జాతీయవనం (నేషనల్ పార్క్) అద్భుతమైన ప్రకృతి అందచందాలకు, పర్యావరణ సంపదకు అలాగే అరుదైన జీవ వైవిధ్యానికి ఆటపట్టు. ఒకప్పటి అవిభాజ్య ఆంధ్రప్రదేశ్‌లో అయితే తూర్పు, పశ్చిమ గోదావరి, ఖమ్మం జిల్లాలలో ఈ అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ లోని ఉభయగోదావరి జిల్లాలకు అలాగే తూర్పుగోదావరి జిల్లాలో కలిపిన విలీన ప్రాంతంలో ఇది పరిమితమైంది. రంపచోడవరం, రాజవొమ్మంగి, మారేడుమిల్లి, చింతూరు, పాపికొండలు, కొండమొదలు, విఆర్ పురం, పోలవరం, శ్రీరామగిరి, పేరంటాలపల్లి తదితర అటవీ ప్రాంతాలు, పలు గిరిజన గ్రామాలూ దీని పరిధిలోకి వస్తాయి. పాపికొండలు, తూర్పు కనుమలలోని దట్టమైన అడవులతో కూడిన ఒక పర్వత శ్రేణి. ఇవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల నడుమ ఉన్నాయి. ఈ పాపికొండల ప్రాంతం జాతీయ పార్కుగా గుర్తించబడింది. పాపికొండల ప్రాంతంలో సాధారణంగా చెట్లు ఆకులు రాల్చవు. ప్రశాంతమైన, సుందరమైన, రమణీయమైన, ఆహ్లాదకరమైన ప్రదేశానికి నెలవు పాపికొండలు జాతీయవనం. కొండలూ, లోయలు, జలపాతాలు, గిరిజనపదాలు దీనికి గొప్ప విశిష్ట గుర్తింపుని ఇచ్చాయి. ఎండాకాలంలో కూడా పాపికొండల ప్రాంతం చల్లగానే ఉంటుంది. భద్రాచలం వద్ద మునివాటం అనే చోటికి దగ్గరలో జలపాతం ఉంది. ఇక్కడ ఒక శివలింగం సర్పం నీడలో అద్భుతంగా ఉంటుంది.

పాపికొండల అడవుల్లో పెద్ద పులులు, చిరుతపులులు, నల్లపులులు, అడవిదున్నలు (గౌర్ర గేదెలు), జింకలు, దుప్పులు, నక్కలు, తోడేళ్ళు, కొండచిలువలు, వివిధ రకాల కోతులు, ఎలుగుబంట్లు, ముళ్ళ పందులు, అడవి పందులు, వివిధ రకాల పక్షులు, విషకీటకాలు ఉంటాయి. అలాగే వేలాది రకాల ఔషధ వృక్షాలు, మొక్కలు ఉన్నాయి. 1978 లో 591 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో పాపికొండ అభయారణ్యం ఏర్పాటైంది. 1012 .86 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో దీనిని 2008 లో జాతీయవనం (నేషనల్ పార్క్) గా అప్ గ్రేడ్ చేసారు. పర్యావరణ ప్రాధాన్యత మాత్రమే కాకుండా ఈ జాతీయ వనానికి పౌరాణిక, ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాధాన్యతలు కూడా ఉన్నాయి.

కొండమొదలు పాపికొండ అభయారణ్యంలో ఒక ముఖ్య ప్రదేశం. ఇందులో జనం వెళ్ళడానికి వీలు లేనంత దట్టమైన, లోతట్టు ప్రదేశాలు అనేకం ఉన్నాయి. ఈ ప్రాంతం సమస్తం ప్రకృతి సౌందర్యంతో అలరారుతుంది. ఇక్కడి జలపాతాలనుంచి వచ్చే నీరు జిల్లాలోని అటవీ ప్రాంతంలో గల అన్ని జలవనరులకూ అందుతుంది. ఇక్కడ కనిపించే జీవ, వృక్షజాలం జీవ వైవిధ్యపరంగా ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

pdfelement

పరిశోధనా పటిమతో అటవీ నేరాలకు చెక్

అటవీసంబంధమైన నేరాలను నిరోధించడంలోనూ, విధినిర్వహణను మెరుగుపర్చుకోవడంలోను సిబ్బంది పరిశోధనాపటిమ, మేధాశక్తి ప్రముఖ పాత్ర పోషిస్తాయని రిటైర్డ్ అడిషినల్ ఎస్‌పి ఎన్ నాగేశ్వరరావు అన్నారు. అటవీ నేరాల నిరోధం, నేర పరిశోధనలో మెళకువలపై అటవీ అధికారులకు శిక్షణ సెప్టెంబర్ 25న ప్రారంభమైంది. శిక్షణకు రిసోర్స్‌పర్సన్‌గా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతివ్యక్తిలోనూ పరిశీలన, పరిశోధనా శక్తులు ఉంటాయని, అయితే వీటిని నిర్మాణాత్మకంగా ఉపయోగించుకోవడం పోలీసు, అటవీ తదితర శాఖల వారికి అవసరమన్నారు. పోలీసు పరిభాషలో ఏదైనా నేరానికి సంబంధించి అందిన సమాచారాన్ని ఇంటెలిజెన్స్ అంటారన్నారు. ఈ సమాచారాన్ని సరైన రీతిలో విశ్లేషించుకొని సకాలంలో తగు చర్యలు తీసుకోవడం వల్ల నేరాన్ని నిరోధించడం సాధ్య పడుతుందన్నారు. నిఘాలోని వివిధ పద్ధతులను, ఇన్‌ఫార్మర్ల వ్యవస్థ తీరుతెన్నులను నాగేశ్వరరావు వివరించారు. 3 రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాన్ని అటవీ అకాడమీ అసెంబ్లీ హాల్లో డైరెక్టర్ జెఎస్ఎన్ మూర్తి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశోధనా దృష్టి ఉన్నచోట విజయం ఉంటుందన్నారు. భారతీయ సంస్కృతిలో పరిశోధనాత్మక దృక్పథం రామాయణం, భారతం వంటి ఇతిహాసాల్లో కూడా కనిపిస్తుందని పేర్కొన్నారు. పరిశోధనాత్మక దృష్టిని, విశ్లేషణా నైపుణ్యాన్ని సిబ్బంది అలవర్చుకుంటే విధినిర్వహణలో వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని చెప్పారు. అటవీశాఖ విజిలెన్స్ డిఎఫ్ఓ ఆర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బీట్, సెక్షన్ ఆఫీసర్లంతా పోలీసుశాఖలోని ఇంటెలిజెన్స్ అధికారుల మాదిరిగా వ్యవహరిస్తే అటవీనేరాల నిరోధం సాధ్యపడుతుందన్నారు. అటవీ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ ఎంవి ప్రసాదరావు శిక్షణ ఉద్దేశాలను వివరించారు. 27వ తేదీ వరకూ కొనసాగే ఈ శిక్షణ కార్యక్రమంలో అరవై మంది అటవీఅధికారులు పాల్గొంటున్నారు.